క్లుప్తంగా

మంత్రులను కలిసిన వినిస్టన్ బాబు



మంత్రి కొట్టు సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామానికి చెందిన కుంచిలపల్లి వినిస్టన్‌బాబు ఆదివారం జిల్లాలోని ఇద్దరు మంత్రులను కలిసి ఆశీస్సులు కోరారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, అలాగే రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణలను కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి తనను యూత్ అధ్యక్షుడుగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, బూరుగుపల్లి సొసైటీ అధ్యక్షుడు బోనం మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుల చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ పాలకవర్గ చైర్మన్ కొల్లాటి రామారావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా సాయిబాబా పల్లకీ ఉత్సవం



సత్తారామేశ్వరంలో షిర్డీ సాయిబాబా గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని సత్తారామేశ్వరం గ్రామంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం బాబాకు విశేష పూజలు చేశారు.మధ్యాహ్నం బాబా పల్లకీ ఉత్సవం, నగర సంకీర్తనలతో గ్రామోత్సవం చేశారు. పంచాయతీరాజ్ రిటైర్డు డీఈ కర్రి రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో సోమవారం అఖండ అన్న సమారాధన నిర్వహిస్తారని భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎల్బీచర్లలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం



ఎల్బీచర్లలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని త్రైత సిద్ధాంత భగవద్గీత చదవడం ద్వారా తెలుసుకోగలుగుతారని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి మామిడికుదురు కమిటీ అధ్యక్షులు బండారు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులతో కలిసి ఆయన నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి త్రైత సిద్ధాంత గ్రంథాలను దైవ జ్ఞాన ప్రచారంలో భాగంగా గ్రామస్తులకు గీతా ప్రతులను, ఇతర నీతి, ఆధ్యాత్మిక గ్రంథాలను అందించారు.

హాస్టల్ విద్యార్థులకు అవగాహన

సాక్షి,భీమవరం: సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులను తమ ఇంటి పిల్లల మాదిరిగా చూసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి జి.గణపతిరావు హాస్టళ్ల సిబ్బందికి సూచించారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా పదో తరగతి హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ, పునశ్చరణ తరగతులు ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు యోగా క్లాసులు నిర్వహించి సైకాలజిస్టుల ద్వారా పరీక్షల మానసిక సన్నద్ధతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించే విధంగా సిబ్బంది పర్యవేక్షించాలని అన్నారు. సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం హాస్టల్లో భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు

- రూ.3.37 కోట్ల నిధులతో రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణం
- చురుగ్గా సాగుతున్న పనులు



స్టేషన్‌పేట వద్ద రూ 1.05 కోట్లతో చురుగ్గా జరుగుతున్న సీసీరోడ్డు, కెనాల్ సపోర్టింగ్‌వాల్ పనులు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో పలు వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టుల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రోడ్లు నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. కీలకమైన ప్రాంతాల్లో, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రెయిన్స్‌కు కొత్తరూపు వస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో జనరల్ ఫండ్స్‌ను పెద్ద ఎత్తున ఖర్చుచేస్తూ అభివృద్ధి పనులు చేపట్టిన మున్సిపాలిటీ పాలకవర్గం తాజాగా 14వ ఆర్థిక సంఘం నిధులతో పూర్తిగా రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాంచాలని తలపెట్టింది. ఇప్పటికే పలుచోట్ల టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టారు. ప్రస్తుత వేసవికాలం చివరినాటికి పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. స్టేషన్‌పేట, గ్రేస్‌నగర్, ఎన్టీఆర్‌కాలనీ, నందమూరి కాలనీ, వైఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లు శిథిలం కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో కొన్ని చోట్ల డ్రెయిన్స్ కూడా శిథిలమయ్యాయి. దీంతో ప్రధానంగా 14వ ఆర్థిక సంఘం నిధులను ఈ ప్రాంతాల్లో వెచ్చిస్తున్నారు.

రూ.3.37 కోట్లతో..

పట్టణంలో మొత్తం రూ.3.37 కోట్లు 14వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల స్టేషన్‌పేట రైల్వేస్టేషన్ వెనుక చినమామిడిపల్లి మీదుగా రైల్వే గేట్ సమస్యకు బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ బైపాస్ రోడ్డుకు అనుసంధానంగా స్టేషన్‌పేటలో ఉన్న రోడ్డును పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నారు. రూ.1.05 కోట్లతో సీసీరోడ్డు, కెనాల్‌ప క్కన సపోర్టింగ్ వాల్ నిర్మిస్తున్నారు. అలాగే స్టేషన్ పేట నుంచి గ్రేస్ నగర్ వరకూ బీటీ రోడ్డును రూ.36 లక్షలతో నిర్మిస్తున్నారు. 22వ వార్డులో రూ.42 లక్షలతో సీసీరోడ్డు, ఎన్టీఆర్ కాలనీలో రూ.36 లక్షలతో సీసీ రోడ్డు, వైఎస్సార్ నగర్‌లో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు, 2వ వార్డులో రూ.28 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్, 10వ వార్డులో రూ.12 లక్షలతో డ్రెయిన్, 1వ వార్డు శ్రీహరిపేటలో రూ.30 లక్షలతో సీసీరోడ్డు, కల్వర్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రహదారులు వినియోగంలోకి వస్తే ప్రజల ఇబ్బందులు తీరనున్నాయి.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



వార్డుల్లో చాలా కాలంగా రోడ్లు, డ్రెయిన్స్ శిథిలమయ్యాయి. గత ప్రభుత్వంలో పాలకవర్గం రోడ్ల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టికి ప్రజలు రోడ్లు, డ్రెయిన్స్ సమస్యను తీసుకొచ్చారు. ఆయన ఆదేశాల మేరకు 14వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు, డ్రెయిన్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇప్పటికే చేపట్టిన పలు పనులు చివరి దశలో ఉన్నాయి. పనులు నాణ్యతతో చేసేలా పర్యవేక్షిస్తున్నాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

చురుగ్గా జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే



లంకలకోడేరులో డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న సర్పంచ్ చొప్పల రజని

పాలకొల్లు అర్బన్: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా డ్రోన్ సర్వే చురుగ్గా సాగుతోంది. డ్రోన్ అగ్రి ఇన్‌ఫ్రా ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు. మండలంలోని శివదేవునిచిక్కాల, దగ్గులూరు, లంకలకోడేరు, అరట్లకట్ట, కాపవరం, చింతపర్రు, పాలమూరు, గవరపేట, తిల్లపూడి గ్రామాల్లో ఆదివారం డ్రోన్‌ద్వారా సర్వే చేశారు. ఈ సర్వేలో క్షేత్రస్థాయిలో ఉన్న భూములకు, రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న భూములకు తేడాలుంటే వాటిని రెవెన్యూ అధికారుల ద్వారా సరి చూసుకోవచ్చని చెబుతున్నారు. లంకలకోడేరులో సర్పంచ్ చొప్పల రజని డ్రోన్ సర్వేను ప్రారంభించారు. తహసీల్దార్ టి.నాగలత సర్వేను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



సిద్ధాంతంలో విజేతగా నిలిచిన అర్థవరం జట్టు

పెనుగొండ: సిద్ధాంతంలో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా అర్థవరం జట్టు నిలిచింది. ఆదివారం ఫైనల్‌లో అర్థవరం, సిద్ధాంతం జట్లు పోటీపడగా అర్థవరం విజేతగా నిలిచి రూ.33,333 నగదు బహుమతిని గెలుచుకుంది. రెండవ స్థానంలో నిలిచిన సిద్ధాంతం జట్టుకు రూ.22,222 నగదు బహుమతిని అందించారు. బహుమతి ప్రదానోత్సవంలో సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పోటీలు గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహంగా ఉంటుందన్నారు.

హిందూ ఉపాధ్యాయ సమితి కార్యవర్గం ఎంపిక



హిందూ ఉపాధ్యాయ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: హిందూ ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఉండి సంఘ అభివృద్ధికి మరింత కృషి చేయాలని హిందూ ఉపాధ్యాయ జాతీయ అధ్యక్షులు డేగల మహేష్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో హిందూ ఉపాధ్యాయ సమితి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా కొల్లేపర కృష్ణప్రసాద్ (తాడేపల్లిగూడెం), సహాధ్యక్షుడిగా నంబూరి సుబ్బరాజు (భీమవరం), ఉపాధ్యక్షుడిగా నారిన మురళీకృష్ణ (భాడవ), ప్రధాన కార్యదర్శిగా శిరిగినీడి రమేష్ బాబు (పాలకొల్లు), కోశాధికారిగా రాయపూడి భవానీప్రసాద్ (పాలకొల్లు), కార్యదర్శులుగా సిద్ధిరెడ్డి పెద్దిరాజు(పెనుగొండ), దేవరపు ఏసుబాబు (పోడూరు), అడబాల గోపాలకృష్ణ (మొగల్తూరు), చింతలపూడి శ్రీనివాసు (పేకేరు)లను ఏకగ్రీవంగా నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొల్లేపర మారుతి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసు తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

రాష్ట్రంలో బీసీలకు సముచిత స్థానం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకుడు పాకా సత్యనారాయణ

ఆకివీడు: పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు, పంచాయతీలకు నిధులు విడుదల చేయాల్సి ఉందని, అయితే జనగణనలో కులగణన చేయడంలో తీవ్ర జాప్యం వల్ల తీరని నష్టం వాటిల్లుతోందని బీసీ సంఘ నాయకులు పాకా సత్యనారాయణ అన్నారు. స్థానిక గౌడ కల్యాణమండపంలో ఆదివారం జనగణనలో కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు సముచిత ప్రాధాన్యత లభిస్తోందన్నారు. నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యుల నియామకాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యతనిచ్చిందన్నారు. జనగణన, కులగణనను రాష్ట్రాలు చేపట్టాలంటే ఆంధ్ర రాష్ట్రంలో ఒక్క రోజులోనే లెక్కింపు జరిగే అవకాశం ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థతో గణన చేయడం సులభమన్నారు. జనగణన, కులగణనతోనే వెనుకబడిన తరగతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. జనాభాలో అధిక శాతం బీసీలు ఉన్నప్పటికీ రాజ్యాధికారం, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యంగాని పూర్తి స్థాయిలో లభించడంలేదని పాకా ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తున్న కేంద్ర ప్రభుత్వం, జనగణనను సకాలంలో నిర్వహించకపోవడం దారుణమన్నారు. జనగణనతో పాటు కులగణన నిర్వహించి ఆరు దశాబ్దాల కాలం గడిచిందన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలంతా ఐక్యంగా ఉన్నప్పుడే కులగణనలో న్యాయం జరుగుతుందని పాకా అన్నారు. పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీలంతా మధ్యతరగతి కుటుంబాలుగా ఉన్నందున వెనుకబడి ఉన్నారని, ఆర్థికంగా ముందుకు వెళ్లినప్పుడు, రాజకీయంగా ఎదిగినప్పుడు తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని చెప్పారు. కులగణన జరగకపోవడంతో తీవ్ర నష్టానికి గురవుతున్నామని వాపోయారు. సమావేశానికి కౌన్సిలర్ కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్ అధ్యక్షత వహించగా, వీరవల్లి శ్రీనివాస్, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, గేదల అప్పారావు, కొండేటి శివ కుమార్, బడుగు బాలాజీ, చుక్కా సత్యనారాయణ, తోట శివాజీ, బొల్లా వెంకట్రావు, జుత్తిగ నాగరాజు, శివయ్య, హుస్సేన్, బచ్చు కృష్ణ, కిమిడి అరుణకుమారి, సప్పా స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

వీరవాసరం: బాలేపల్లి దళితపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన మూడు కుటుంబాల వారిని ఆదివారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పరామర్శించారు. మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం ఏర్పాటు చేసిన బియ్యం, వంట సామగ్రి, దుప్పట్లను మోషేనురాజు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. మోషేనురాజు బాధితులకు కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున రావాల్సిన అన్ని పథకాలు, నూతన గృహాలు మంజూరు చేయించడానికి కృషి చేస్తానని అన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, యర్రంశెట్టి శ్రీనివాసు, నేతలు జ్ఞాన సుందర్‌రాజు, చిక్కాల రాజు, బొంతు రమేష్, మానుకొండ ప్రదీప్ కుమార్, చికిలే మంగతాయారు, గద్దం భాస్కర్ రావు, మల్ల శ్యాంబాబు, గోడు షణ్ముఖ బాబు, చిలకపాటి సునీత, పడవల నాని, పాలమూరి బులిరాజు పాల్గొన్నారు.

నేడు ఆచంటలో గడపగడపకు మన ప్రభుత్వం

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం సోమవారం ఆచంటలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి, ఆచంట గ్రామ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ ఆదివారం విలేకరులకు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొని లబ్దిదారులకు అందించిన సంక్షేమాన్ని వివరిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ ఆదివారం విలేకరులకు తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందివచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆలయ పునఃప్రతిష్టాపనోత్సవాలు

నరసాపురం: పట్టణంలో మెయిన్‌రోడ్డులోని కుమ్మరవీధి రామాలయంగా పేరుగాంచిన కోదండ రామాలయం స్వామి వారి పునఃప్రతిష్టాపన మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 3 వరకూ నిర్వహించే ఈ ఉత్సవాలకు సంబంధించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 1910లో నిర్మించిన ఈ ఆలయాన్ని కొవ్వలి పౌండేషన్ ద్వారా రూ.1 కోటితో అభివృద్ధి చేస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు కొవ్వలి ఫౌండేషన్ అండ

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సికిలే భాస్కరరావు, సికిలే ప్రసాద్ కుటుంబ సభ్యులు నష్టపోయారు. వీరికి ఆదివారం కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయాన్ని అందించి భరోసా కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు: గొల్లలకోడేరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల నిమిత్తం సోమవారం గొల్లలకొడేరు, గరగపర్రు, మైప, యండగండి, మహాదేవపట్నం, కొండేపాడు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

ఘనంగా సూర్యహోమం



సూర్యహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: కోవిడ్ మహమ్మారి నుంచి ప్రజలు రక్షించబడాలనే సంకల్పంతో పాలకొల్లు పట్టణంలో సరస్వతి శిశుమందిర్‌లో మొదలు పెట్టిన సూర్యహోమం 144వ వారానికి చేరుకుంది. ఆదివారం కోడిగట్టు సరస్వతి శిశు మందిర్‌లో సూర్యహోమం ఘనంగా నిర్వహించారు. రవీంద్ర బ్రహ్మత్వంలో ఈ హోమం ఏర్పాటు చేశారు. ప్రతీ ఆదివారం సూర్యహోమం నిర్వహిస్తున్నామని, ఇప్పటికి 144 వారాలు పూర్తయినట్లు నిర్వాహకులు కె.వి.ఎల్ నరసింహరావు తెలిపారు. ఈ హోమంలో ఐదుగురు దంపతులు పాల్గొన్నారు. ప్రతీ ఆదివారం జరిగే ఈ సూర్యహోమంలో పాల్గొనే భక్తులు కోడిగట్టు సరస్వతి శిశుమందిర్ వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు

2 నుంచి కనకదుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవాలు



శ్రీ కనకదుర్గమ్మ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మార్చి 2వ తేది గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలు మార్చి 2 నుంచి 10 వరకూ తొమ్మిది రోజులు పాటు నిర్వహిస్తామన్నారు. గురువారం రాత్రి 7.15 గంటలకు ధ్వజా రోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. శుక్రవారం రాత్రి 7.29 గంటలకు కనకదుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణం, శనివారం మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి పట్టణ ఊరేగింపు, ఆదివారం రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, లక్ష దీపాలంకరణ, సోమవారం రాత్రి దర్బారుసేవ, మంగళవారం ఉదయం పూర్ణాహుతి, దండాడింపు ఉత్సవం, త్రిశూల స్నానం రాత్రి 7 గంటలకు అమ్మవారికి లక్ష చామంతి పూలతో పూజ, బుధవారం లక్ష పసుపు కొమ్ముల పూజ, గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు, శుక్రవారం ఏకాంతసేవ, శ్రీపుష్పోత్సవం కార్యక్రమంతో ఉత్సవ కార్యక్రమాలు ముంగించనున్నట్లు తెలిపారు. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది ఉత్సవ ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు.

రాజ్యాధికారం వైపు పయనించాలి



నడిపూడిలో మాట్లాడుతున్న రాజేష్

పెనుగొండ: దళితులందరూ బహుజనులను కలుపుకొని రాజ్యాధికారం వైపు పయనించాలని రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ అన్నారు. ఆదివారం నడిపూడి శివారు కట్టావారిపాలెంలో నిర్వహించిన మాలమహానాడు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దళితులు ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. దళితవాడల అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండే నగేష్ బాబు, ఉపాధ్యక్షుడు సరేళ్ల శ్రీనివాస్, ఆచంట నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, గాది రవి, రొక్కాల విజయగాంధీ, బద్దా అంతర్వేది, మట్టా చంద్రశేఖర్, సరేళ్ల రఘు, కుసుమే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం సర్పంచ్‌కు అవార్డు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న సర్పంచ్ కనకదుర్గ

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం సర్పంచ్ సూరవరపు కనకదుర్గకు గ్లోబల్ ఐకాన్ బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు లభించింది. ఈ మేరకు సర్పంచ్ ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. బాలివుడ్‌సినీ రిపోర్టర్ సంస్థ 2022 ఏడాదికి ప్రకటించిన బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు తనకు లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 24న ఢిల్లీలో ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. మరిన్ని సేవాకార్యక్రమాలను చేపడతామని సర్పంచ్ తెలిపారు. జిల్లా బీసీ సంఘాధ్యక్షుడు, విశ్వబ్రాహ్మణ సంఘ వర్కింగ్ ప్రసిడెంట్ సూరవరపు వెంకటాచార్యులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

మొగల్తూరు: తనను కొట్టి గాయపర్చారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బి.సత్యనారాయణ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం మేరకు మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి తూర్పుతాళ్లుకు చెందిన కాటం సుమదీష్‌ను అదే గ్రామానికి చెందిన కాటం సుందర బాబు, కాటం పృథ్వీరాజ్‌లు గత రాత్రి కొట్టి గాయపర్చారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనపై అనుమానంతో అర్ధరాత్రి సమయంలో దాడి చేశారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం బాధితుడు నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులను ఆశ్రయించాడు.

మేడిది జాన్సన్‌కు సత్కారం

భీమవరం (ప్రకాశంచౌక్): సంజీవయ్య నగర్‌లో పాస్టర్ సామ్యూల్, పెద్దలు సుమన్ సురేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు. క్రైస్తవుల ఉన్నతి కోసం ప్రభుత్వ సహకారంతో మరింత కృషి చేస్తానని చెప్పారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

భీమవరం అర్బన్: కొత్తపూసలమర్రులో ఆదివారం కోడిపందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై డి.మోహన్‌రావు చెప్పారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.3,190 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: మండలంలోని కోరుకొల్లు గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు ఎస్సై ఎస్సై నాళం శ్రీనివాసరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, రూ.800 నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను భీమవరం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు